క్లుప్తంగా

మోమిన్‌ఖుర్దుకు ఆర్టీసీ బస్సు నిలిపేత

ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామానికి నిత్యం వచ్చే ఆర్టీసీ బస్సును అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతవరకు వికారాబాద్ నుంచి బొంరాస్‌పేట్ మీదుగా రోజు 3 ట్రిప్పులు కొడంగల్‌కు బస్సు వెళ్లి వచ్చేదని వారు గుర్తు చేశారు. 4 రోజుల నుంచి ఏ కారణం చెప్పకుండా ఒక్కసారిగా బస్సు రాకపోకలను నిలిపివేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బస్సును నిలిపివేయడతో పలు గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు పునరాలోచించి నిలిపివేసిన బస్సు రాకపోకలను తిరిగి పునరుద్ధరించి ప్రయాణికులకు మేలు చేయాలనినీ వారు కోరారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రమేశ్‌కు నియామకపత్రం ఇస్తున్న నాయకులు

కుల్కచర్ల: స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పోమాల నరేశ్, కార్యదర్శి సుంకు మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామంలో నూతనంగా పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎర్రం రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్యకర్తలు ఎన్నికలకు సర్వత్రా సన్నద్ధం కావాలని, ప్రతీ గ్రామంలో బీజేపీ అభ్యర్థులు వార్డు సభ్యుల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా గెలుపొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు, మొగులయ్య, సంతోష్, నరేష్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలకోసం ఎల్‌ఓసీలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన అనంతయ్యకు రూ.2.50లక్షలు, పగిడియాల గ్రామానికి చెందిన నేత వెంకటమ్మకు రూ.2.50లక్షలు మంజూరు చేయించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి



టీకా వేస్తున్న వైద్యురాలు దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు ఆర్థికాభివృద్ధి చెందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య అధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి నదీమ్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. వేసవిలో పాల ఉత్పత్తి తగ్గుతుందని, మూగ జీవాలకు అధికంగా నీటిని అందించాలని చెప్పారు. ఓఎస్ రవి, రైతులు, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేష్ అన్నారు. చైత్ర మాసం శుక్రవారం పురస్కరించుకొని సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్‌లు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనసు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

నిండా ముంచేస్తున్నారు!

- ధాన్యం కొనుగోలులో తిరకాసు
- బస్తా 42కిలోలైతేనే ఓకే
- లేదంటే దించుకునేందుకు మెలిక పెడుతున్న మిల్లర్లు
- ఆయా కేంద్రాల్లో భారీ దోపిడీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



కొనుగోలు కేంద్రం

పరిగి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ మొదలైంది. ధాన్యం సరిగా లేదని తేమ, తాలు సాకు చూపి బస్తాకు 42కిలోల చొప్పున తూకం వేస్తూ రైతులను నిండా ముంచేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఆయా కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తీసుకువస్తున్నారు. క్రమంగా ధాన్యం రావడం పెరుగుతుండటంతో మిల్లర్లు మెలికలు పెడుతున్నారు. తూకంలో అధికంగా బరువు వెయ్యొద్దని మిల్లర్లకు ముందే చెప్పినప్పటికీ మోసాలకు పాల్పడుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం 42 కిలోల కన్న తక్కువ ఉంటే దించబోమని కేంద్రాల నిర్వాహకులకు, రైతులకు మిల్లర్లు చెబుతుండటంతో తప్పని పరిస్థితుల్లో 42 కిలోలు జోకుతున్నారు. నిబంధనల ప్రకారం 40 కిలోల తూకానికి గన్నీ సంచితో మరో 500 గ్రాములు కలిపి మరో అర కిలో తరుగు చేర్చిన మొత్తం 41 కిలోలకు పరిమితం కావాలి. అయితే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తే 42కిలోల కన్న తక్కువ ఎవ్వరూ తూకం వెయ్యడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే మిల్లర్లు తీసుకోవడం లేదని బస్తాకు 42 కిలోల తూకం వేస్తేనే పంపాలని చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా ఆదే చెబుతున్నారని దీంతో తప్పని పరిస్థితుల్లో తూకం వెయ్యాల్సి వస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు.

తాలు, తేమ, శుభ్రంగా లేవని..

జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాలు ఉండగా జిల్లా వ్యాప్తంగా 1.5 లక్షల మెట్రిక్ టన్ను వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 12,185 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశారు. ఏటా ప్రతీ సీజన్‌లో మిల్లర్లు తేమ, శుభ్రత సాకుతో రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. నిబంధనల ప్రకారం 17శాతం లోపే తేమ ఉంటే మద్దతు ధర చెల్లించాలి. ఎండల తీవ్రత కారణంగా ప్రతీ రైతు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుని తేమ పరిశీలించుకున్న తరువాతే అమ్మేందుకు తీసుకువస్తున్నారు. వరి పంటలను యంత్రాలతో కోయడంతో ధాన్యం శుభ్రంగాను వస్తున్నాయని చెబుతున్నారు. కొంత మంది రైతులు ధాన్యం శుభ్రం లేకుంటే మళ్లీ తూర్పార పట్టి ఆర బెడుతున్నారు. మిల్లర్ల మాయాజాలం వెనకాల కొంత మంది కేంద్రాల నిర్వాహకులు ఉన్నట్టు సమాచారం. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు.

అధిక తూకంతో నష్టం

మిల్లర్ల మాయాజాలంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బస్తాకు 42 కిలోల తూకం వేస్తుండటంతో క్వింటాల్ ధాన్యానికి 5కిలోల ధాన్యం నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను రైతులు నిలదీస్తే వారి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఒక పక్క రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అడ్డగోలుగా రైతుల నుంచి దోచుకుంటున్నారు. అధిక తూకం వేస్తేనే కొనుగోలు చేస్తామని అంటున్న మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



తూకం వేసిన 42కిలోల సంచి

బస్తాకు 42 కిలోలు



రెండు ఎకాల్లో సాగు చేస్తే 70 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రతి బస్తాకు 42 కిలోల తూకం వేశారు. ఎందుకని ప్రశ్నిస్తే మిల్లర్లు 42 కిలోల తూకం వేస్తేనే తీసుకుంటామని చెబుతున్నారు. అందుకే తూకం వేస్తున్నామని నిర్వాహకులు వివరిస్తున్నారు. ఈ విషయంలో చేసేదేమి లేక వారు చెప్పినట్లే తూకం వేసిన ఊరుకోవల్సివస్తోంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, పాలేపల్లి

41 కిలోలే తూకం వేయాలి

వరి ధాన్యం బస్తాకు 41కిలోలే తూకం వేయాలి. 42 కిలోల తూకం వేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. మిల్లర్లు 42కిలోల తూకం వేయాలని చెబితే మిల్లర్లతో మాట్లాడి నిబంధనల ప్రకారం తూకం వేసేల చర్యలు తీసుకుంటాం.

– బాబుమోహన్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



కుల్కచర్ల: మరికల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల నివాసప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను పరిశీలించి తదుపరి తీసుకోబోయే నిర్ణయాల గురించి వివరించారు. ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులు హౌసింగ్ అధికారులు సూచించిన నియమనిబంధనలను అనుసరించి ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల తుది జాబితా సోమవారం విడుదల

తాండూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే దాదాపు పూర్తయ్యింది. తాండూరు మండలంలోని 33 గ్రామాల్లో 722 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. క్షేత్రస్థాయిలో కూడా సర్వే కమిటీలో ఎంపీడీఓ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులుగా ఎంఈఓ, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దాదాపు వెరిఫికేషన్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంపీడీఓలతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిరు పేదలకు ఇళ్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పూర్తయ్యిందని సోమవారం లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

బీటీరోడ్డుకు మరమ్మతులు

- మండల అధికారుల చొరవతో పనులు
- అభినందిస్తున్న మండల ప్రజలు



పెద్దేముల్-బండపల్లి బీటీ రోడ్డుకు కంకరవేసి మరమ్మతులు

తాండూరు రూరల్: అధికార పార్టీలో ఉండి రాజకీయ నాయకులు చేయలేని పనులకు మండల అధికారులు చేసి చూపించారు. దీంతో అధికారుల పని తీరుపై మండల ప్రజలు అభినందిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల కేంద్రం నుంచి బండపల్లి గేటు వరకు తాండూరు–సంగారెడ్డి రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో నిత్యం పెద్దేముల్, బుద్దారం, బండపల్లితో పాటు తాండూరు పట్టణానికి వెళ్లే మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ప్రతీ రోజు ఈ రోడ్డుపై గుంతలను చూసి అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసేవారు. నిత్యం రాకపోకలు చేసే అధికారుల మనసు చలించిపోయింది. దీంతో వెంటనే పెద్దేముల్ తహసీల్దార్ వెంకట్ ప్రసాద్, ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. రోడ్డు బాగలేకనే ప్రమాదాలు జరిగేవని కలతచెందిన వారు క్షేత్రస్థాయిలో యువకుల సహకారంతో దగ్గరుండి పనులు చేయించారు. పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు బండపల్లి గేటు వరకు గుంతలమయ మైన రోడ్డుపై కంకరవేసి చదునుచేయించారు. గాజీపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గాజుల గౌస్‌కు చెందిన ట్రాక్టర్, జేసీబీ సహాయంతో బండపల్లి నుంచి పెద్దేముల్ వరకు ఏర్పడిన గు ంతలను పూడ్చి వేయించారు. దీంతో మండల ప్రజలు అధికారుల తీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాణా ప్రతాప్‌సింగ్ చిరస్మరణీయుడు

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- ఘనంగా రాణా ప్రతాప్ సింగ్ జయంతి



మహారాణా ప్రతాప్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: మొఘలులను గడగడలాడించిన మహారాణా ప్రతాప్‌సింగ్ చిరస్మరణీయుడని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం రాజ్‌పుత్ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని రాణా ప్రతాప్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాణా ప్రతాప్‌సింగ్ వీరత్వం, పోరాట పటిమను ప్రపంచ దేశాలు కీర్తించాయన్నారు. హిందూ స్వరాజ్య స్థాపన కోసం మొఘలులను ఎదిరించి నిలిచిన ధీశాలి అని గుర్తు చేశారు. ఆయన ధీరత్వం, దేశ భక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తాండూరు రాజ్‌పుత్ సమాజం అభివృద్ధికి కృషి చేస్తామని, వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత, నాయకులు పట్లోళ్ల నర్సిములు, రవీందర్, బిర్కట్ రఘు, సూరజ్‌సింగ్ ఠాకూర్, దిలీప్‌సింగ్, శివానంద్ సింగ్, దీపక్ ఠాకూర్ అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్‌చలో– బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్‌లో బీసీ కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. బీసీ కులగణన, దేశ రక్షణలో భాగంగా పాక్ తీవ్రవాదులపై సిందూర్ ఆపరేషన్ వంటి సాహసోపేతమైన నిర్ణయాలు గర్వకారణమన్నారు. బీజేపీ నాయకులు సురేష్, కుర్మయ్య, ప్రశాంత్, రఘుగౌడ్, లింగం, కృష్ణ, మధు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కార్మికుడు

అభినందించిన మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: పరిగి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కిష్టయ్య తన నిజాయితీని చాటుకున్నాడు. రోజు మాదిరిగా మున్సిపాలిటీలోని పదో వార్డులో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నాడు. అదే వార్డుకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో చెత్తను సేకరించడానికి వెళ్లాడు. శ్రీనివాస్‌రెడ్డి సతీమణి చెత్తతో పాటు అరతులం బంగారం కమ్మను చెత్త సంచిలోనే వేసి చెత్త బండిలో పడేసింది. చెత్త పారబోసేందుకు డంపింగ్‌యార్డుకు వెళ్లిన కిష్టయ్య అక్కడ కవర్లో పరిశీలిస్తే బంగారు కమ్మ దొరికింది. చెత్త బండిలో బంగారు కమ్మ శ్రీనివాస్‌రెడ్డి భార్య వేసిందని చెప్పడంతో తనకే దొరికిందని తిరిగిఇచ్చి కిష్టయ్య నిజాయితీ చాటుకున్నాడు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆయన్ను సన్మానించారు. ప్రతిఒక్కరూ తమ విధులను నిజాయితీగా నిర్వహించాలని కిష్టయ్య నిజాయితీ అందరికి ఆదర్శమని కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు

పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడొద్దు

షాద్‌నగర్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్టలో కిషన్‌నాయక్, లింగం నాయక్, రమేష్ నాయక్ ఆధ్వర్యంలో చౌడమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేసి మాట్లాడారు. హిందు ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతుండంతో దేశ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగువుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. దేశ భక్తి, జాతీయ భావాలను సమాజంలో వ్యాపింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్ అప్ప, శ్రీను నాయక్, రాజ్‌కుమార్, రవి, లచ్చిరాం, రాజు నాయక్, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసేవారికే ప్రాధాన్యత

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికే అన్ని పదవులు వస్తున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ఇతర పార్టీల వారికి ఇందిరమ్మ కమిటీలు తదితర పదవులు దక్కుతున్నాయని పార్టీ శ్రేణులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. అధికార పార్టీ కార్యకర్తలకే అవకాశం లభించిందని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇతరులకు పదవులు దక్కినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని పేర్కొన్నారు. చేవెళ్ల ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీలతో పాటు ఇతర పదవుల్లోనూ పార్టీలో పని చేసేవారికే ఎమ్మెల్యే కాలె యాదయ్య అవకాశం కల్పిస్తున్నారని స్పష్టంచేశారు. కొందరు కావాలనే సొంత పార్టీ వారే లేనిపోని ఆరోపణలు చేస్తూ, గందరగోళం సృష్టించడానికి కారణమవుతున్నారని మండిపడ్డారు.

వీర జవాన్‌కు అశ్రునివాళి

షాద్‌నగర్: దేశం కోసం ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ త్యాగం వెలకట్టలేనిదని లంబడాల హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. జవాన్ మృతికి నివాళిగా శుక్రవారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో భారీగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ పై జరుగుతున్న పోరాటంలో ఏపీలోని గిరిజన కుటుంబానికి చెందిన మురళీ నాయక్ మృతి ఎంతో బాధాకరమన్నారు. యుద్ధ భూమిలో ఉగ్రవాదులను హత మార్చడంలో మురళీ పోరాటం ఎనలేనిదని కొనియాడారు. ఆయన త్యాగం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురళీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



మైనార్టీ సంఘం నూతన కార్యవర్గం

హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహెబ్

యాలాల: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం యాలాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలను ఏకం చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయం, విద్య, ఉద్యోగరంగాల్లో మైనార్టీలకు తగిన స్థానం దక్కేలా పోరాటం చేపట్టనున్నట్లు వివరించారు. మైనార్టీలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 12 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

మైనార్టీ హక్కుల పోరాట సమితి యాలాల మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహెబ్ అధ్యక్షతన, తాండూరు అధ్యక్షుడు అబ్దుల్ సమియొద్దీన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. మండల ఇన్‌చార్జి అక్బర్‌బాబా, నూతన అధ్యక్షుడిగా గంతల అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెహరాజ్, ప్రధాన కార్యదర్శిగా వాసిద్ ఖాన్, సభ్యులుగా కరణ్‌కోట రజాక్, అబ్దుల్ జబ్బార్, మౌలాన తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ అబ్దుల్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయండి

షాబాద్: వలస కార్మికుల శ్రమను చందనవెల్లి పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని సీఐటీయూ చందనవెల్లి ఇండస్ట్రీస్ కన్వీనర్ అల్లి దేవేందర్ ఆరోపించారు. శుక్రవారం షాబాద్ మండలం చందనవెల్లి పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను దోచుకుంటున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కొత్త లేబర్ కోడ్స్ కారణంగా ఎ నిమిది గంటల పని విధానం.. 12 గంటలకు పెరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, బ్యాంకు ఉద్యోగులు పిలుపునిచ్చారని పేర్కొన్నారు.

ఆర్థిక ప్రణాళిక అవసరం



వడిచర్లలో ఉపాధి కూలీలకు అవగాహన

బొంరాస్‌పేట: కూలీలందరూ పొదుపు చేయడం నేర్చుకోవాలని విడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వడిచర్లలో ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ప్రతి కూలీ కుటుంబ నిర్వహణకు ఆర్థిక ప్రణాళిక, పొదుపు వంటి వాటికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, బీమా గురించి వారు వివరించారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ఆన్‌లైన్ మోసాలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ వంటివి ఓపెన్ చేయొద్దన్నారు. ఆన్‌లైన్ మోసాలతో డబ్బులు పోగొట్టుకుంటే నేషనల్ సైబర్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్లు నర్సిములు, రామాంజనేయులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.